

నిర్లక్ష్యానికి నెలవు.. ట్రిపుల్‌ఐటీ
రెగ్యులర్ వీసీ లేకపోవడం.. పర్యవేక్షణ కొరవడం.. సిబ్బంది నిర్లక్ష్యం..భద్రతా వైఫల్యం ఫలితంగా బాసర ట్రిపుల్ ఐటీలో ఏదో ఒక సమస్య బయటకు వస్తూనే ఉంది. 10లో▸



వేలం పారదర్శకంగా జరిగేనా..!
భైంసా పట్టణంలోని ఏఎంసీ మడిగెలకు శనివారం బహిరంగ వేలం నిర్వహించనున్నారు. డిమాండ్ నేపథ్యంలో వేలంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 11లో▸

గరిష్టం/కనిష్టం
32.2 /24.2

వాతావరణం
ఆకాశం దాదాపు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడ్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయా కొనుగోళ్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయా కొనుగోళ్లు అక్టోబర్ 5 నుంచి ప్రారంభిస్తామని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ తెలిపారు. పట్టణంలోని ఆయన నివాసంలో మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో కలిసి శుక్రవారం మాట్లాడారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే సోయా విక్రయించాలని సూచించారు. క్వింటాల్‌కు రూ.4,892 మద్దతు ధర పొందాలని సూచించారు. భైంసా, కుభీర్ మండలంలో ముందుగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో కుభీర్ పీఏసీఎస్ చైర్మన్, రాష్ట్ర బోర్డు డైరెక్టర్ గంగచరణ్ పాల్గొన్నారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను కలిసిన శ్రీహరిరావు



నేరెళ్ల శారదను సత్కరిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ మహిళ కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారదను డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు శుక్రవారం ఆదిలాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్క అందజేసి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దశరథ రాజేశ్వర్, నాయకులు పూదరి అరవింద్, ఆడె గజేందర్ తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి




సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్/నిర్మల్ రూరల్ : బీజేపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్మల్‌రూరల్ మండలం నేతలతో సభ్యత్వ నమోదుపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈనెల 30 వరకు ప్రతీ పోలింగ్ బూత్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు 200 మందికి తక్కువ కాకుండా చేయాలని సూచించారు. నిర్మల్ మండలంలోని 100కు పైగా సభ్యత్వం చేసిన సాయన్న, నర్సారెడ్డి, ఏనుగు వెంకట్‌రెడ్డి, ఎం సీ.నర్సయ్య, లవకుమార్‌గౌడ్‌ను సన్మానించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అలివేలు మంగమ్మ, సభ్యత్వ నమోదు కన్వీనర్ కమలేనయన్, నిర్మల్‌రూరల్ మండలం అధ్యక్షుడు తోకల అనిల్, ముచ్చిండ్ల నరేశ్, సభ్యత్వ కన్వీనర్ ఎంపీ.నరసయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందాలి

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. 2024–25 మొదటి త్రైమాసికానికి సంబంధించిన డీసీసీ/డీఎల్ఆర్సీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ ఫోరమ్‌లో జిల్లా క్రెడిట్ ప్లాన్, ఆర్థిక పురోగతి, తదుపరి త్రైమాసికానికి ఆర్థికంగా మద్దతునిచ్చే వివిధ ప్రభుత్వ పథకాలు సోషల్ సెక్యూరిటీ స్కీంల గురించి చర్చించారు. పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, పంట రుణాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ పథకాల గురించి బ్యాంకర్ల సందేహాలు నివృత్తి చేశారు. టీజీబీ రీజినల్ మేనేజర్, ఇతర బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

మిల్లర్లు మింగేశారు!?



జిల్లాలోని ఓ మిల్లులో ధాన్యం బస్తాలు(ఫైల్)

- 'సీఎంఆర్'లో మాయాజాలం
- టన్నుల కొద్దీ ధాన్యం అమ్ముకున్నారు
- సీరియస్‌గా తీసుకున్న అధికారులు
- ఏడు రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు
- రికవరీకి ఆస్తులు వేలం వేసే ఆలోచన

నిర్మల్: మర ఆడించి బియ్యాన్ని ఇవ్వాల్సిన రైస్ మిల్లులు ఆ ధాన్యాన్నే మింగేశాయి. ధనంగా మార్చుకుని తనిఖీకి వెళ్లిన అధికారులకు ఖాళీ మిల్లులు చూపించాయి. జిల్లాలో సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)లో మిల్లర్ల చేతివాటం స్పష్టమైంది. గడువుదాటినా బియ్యం ఇవ్వని రైస్ మిల్లులను అధికారులు పరిశీలించగా.. బియ్యం గింజ కూడా లేకుండా తరలించినట్లు తేలింది. లెక్క ప్రకారం సర్కారుకు ఇవ్వాల్సిన మెట్రిక్‌టన్నుల కొద్దీ ధాన్యాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటించేశాయి. జిల్లాలో 2022–23 ఖరీఫ్ సీజన్ సీఎంఆర్‌కు సంబంధించి ధాన్యం మాయం చేసిన మిల్లులపై అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ఏడు రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదుచేశారు. ధాన్యం డబ్బుల రికవరీలో భాగంగా వీరికి సంబంధించిన ఆస్తులను వేలం వేసే ఆలోచన కూడా చేస్తున్నట్లు తెలిసింది.

అధికారుల దూకుడు..

జిల్లాలో సీఎంఆర్‌కు సంబంధించి కోట్ల రూపాయల ధాన్యాన్ని మాయం చేయడం, సకాలంలో బియ్యం ఇవ్వకపోవడాన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) కిశోర్‌కుమార్ దూకుడుగా వ్యవహరిస్తుండటంతో సదరు మిల్లర్లు బెంబేలెత్తుతున్నారు. ఆయన పర్యవేక్షణలో పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు చేపట్టడమే కాకుండా.. వెంటవెంటనే కేసులను పెట్టేస్తున్నారు. ఈక్రమంలోనే ఏడు మిల్లులపై క్రిమినల్ కేసులను నమోదు చేయించడంతోపాటు సర్కారు ఇచ్చిన ధాన్యం ఎటువెళ్లిందో ఇన్వెస్టిగేషన్ చేయాల్సిందిగా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. ఇప్పటికీ స్పందించని మిల్లుల ఆస్తుల రికవరీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ మిల్లులపైనే కేసులు..

జశ్విత రైస్ మిల్లు, ముధోల్
అక్షయ్‌రెడ్డి రైస్ మిల్లు, కిర్గుల్(బి), మండలం: బాసర
సాయిక్రుప ఇండస్ట్రీస్, బీరవెల్లి, మండలం : సారంగపూర్
వెంకటేశ్వర ఇండస్ట్రీస్, ధర్మోరా, మండలం : లోకేశ్వరం
రాజరాజేశ్వర రైసుమిల్లు, జోహర్‌పూర్, మండలం : లోకేశ్వరం
రాజరాజేశ్వర్ ఇండస్ట్రీస్, దేగాం, మండలం : భైంసా
అన్నపూర్ణ రైసుమిల్లు, చించోలి(బి), మండలం: సారంగపూర్

భారీ మోసం..

సర్కారు రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగిస్తుంది. వారు గడువులోపు మిల్లింగ్ చేసి బియ్యం రూపంలో తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధిత మిల్లర్లు కమీషన్ రూపంలో తీసుకుంటారు. ఈక్రమంలో ఏళ్లుగా చాలామంది మిల్లర్లు చేతివాటం ప్రదర్శిస్తూనే ఉన్నారు. సర్కారు ఇచ్చిన గడువును పట్టించుకోకుండా.. ధాన్యాన్ని అమ్మేసుకుంటూ.. రేషన్ దుకాణాల నుంచి వచ్చిన బియ్యాన్ని తిరిగి సర్కారుకు అప్పగిస్తూ వస్తున్నారు. తాజాగా జిల్లాలోని పలు మిల్లుల్లో భారీగా అవకతవకలకు పాల్పడిన తీరు బయటపడింది. జిల్లాలో మొత్తం 64 మిల్లులకు 2022–23 ఖరీఫ్ సీజన్‌లో 1.20 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యాన్ని ఇవ్వగా, ఇందులో తిరిగి 80 వేల మెట్రిక్‌టన్నులకుపైగా బియ్యం రూపంలో ఇవ్వాల్సి ఉంది. దీంట్లో 32 మిల్లులు 17 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టాయి. దీంతో పెనాల్టీ విధించగా, సదరు మిల్లులు 22,144మెట్రిక్ టన్నుల వరకు ఇవ్వాలి.

చర్యలు తప్పవు..

సీఎంఆర్ విషయంలో ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉంది. జిల్లాలో గడువు దాటినా లెక్కతేల్చని రైస్ మిల్లులపై చర్యలు చేపడుతున్నాం. 2022–23 ఖరీఫ్ సీజన్‌తోపాటు పలు సీజన్ల ధాన్యం లేని ఏడు మిల్లులపై క్రిమినల్ కేసులను పెట్టాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.
– కిశోర్‌కుమార్, అడిషనల్ కలెక్టర్

32 మిల్లులు డిఫాల్ట్..

జిల్లాలో 2022–23కు సంబంధించిన సీఎంఆర్ గడువు నేటి(శనివారం)తో ముగిసిపోతోంది. ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వం గడువును పొడిగిస్తూ వచ్చింది. అయినా చాలా మిల్లులు లెక్కచేయలేదు. సకాలంలో ఇవ్వని డిఫాల్ట్ మిల్లులు 32 ఉన్నట్లు గుర్తించారు. ఈ మిల్లుల నుంచి 2022–23 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పెనాల్టీతో సహా 22,144 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రావాల్సి ఉంది. మూడు నెలలుగా జిల్లా అధికారులు 5,866 మెట్రిక్ టన్నులు రికవరీ చేయగా, ఇంకా 16,278 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లోనే ఉన్నాయి. అధికారుల ఒత్తిడి మేరకు డిఫాల్ట్‌గా ఉన్న 32 మిల్లుల్లో 15 పెనాల్టీతో సహా చెల్లించగా, ఆరు మిల్లులు పెనాల్టీ మాత్రమే పెండింగ్‌లో పెట్టాయి. మరో నాలుగు మిల్లులు ఒకట్రెండు రోజుల్లో చెల్లించనున్నాయి. మిగిలిన ఏడు రైసుమిల్లులను సంబంధిత అధికారులు పరిశీలించగా విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ మిల్లుల్లో మాత్రం సర్కారు ఇచ్చిన ధాన్యం లేదు. ఇందులో కొన్ని మిల్లుల్లో రికార్డులు పరిశీలించగా, 2022–23 ఖరీఫ్‌తోపాటు రబీకి సంబంధించిన ధాన్యం కూడా లేకపోవడం గమనార్హం. పెండింగ్‌లో ఉన్న అన్ని సీజన్ల బియ్యం కలిపి 28 వేల మెట్రిక్ టన్నులకుపైగా రావాల్సి ఉంది. ఈ ఏడు మిల్లుల నుంచే పెనాల్టీతో కలిపి దాదాపు రూ.100 కోట్ల వరకు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

విద్యాశాఖ దిద్దుబాటు!

- యూబిట్‌దందాపై 'సాక్షి' వరుస కథనాలు
- స్పందించిన కలెక్టర్, జిల్లా అధికారులు

నిర్మల్: యూబిట్ దందాతో జిల్లాలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు గాడితప్పారు. తమ విధులను విస్మరిస్తూ.. 'కాయిన్స్' వెంట పరుగులు పెట్టారు. చివరకు ఇందులో ఎనిమిది మంది ఏకంగా జైలుపాలయ్యారు. ఈక్రమంలో జిల్లాలో విద్యావ్యవస్థతోపాటు వివిధ శాఖల తీరుపై 'సాక్షి' వరుస కథనాలను ప్రచురిస్తోంది. ఈ కథనాలపై కలెక్టర్ అభిలాష అభినవ్‌తోపాటు విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. విద్యాశాఖలో పర్యవేక్షణ లోపంపై కలెక్టర్, ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. వారి ఆదేశాల మేరకు విద్యాశాఖలో దిద్దుబాటు చర్యలు చేపడుతున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు.

ఇవి పాటించాల్సిందే..

జిల్లాలో విద్యావ్యవస్థను గాడిన పెట్టడానికి ప్రతీ ఉపాధ్యాయుడు సహకరించాలని డీఈవో సూచించారు. పలు కఠిన నిర్ణయాలను తీసుకున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఆదేశాలు జారీచేసినట్లు చెప్పారు.



సాక్షిలో ప్రచురితమైన కథనాలు

- ఉపాధ్యాయులు తరగతి గదిలో సెల్‌ఫోన్ వాడొద్దని చెప్పారు.
- అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలని ఎంఈవోలను ఆదేశించారు.
- ప్రభుత్వ వేతనం తీసుకుంటూ పాఠశాల వేళల్లో ప్రైవేటు వ్యాపారాలు చేస్తే సస్పెన్షన్ వేటు వేస్తామని పేర్కొన్నారు.
- యూబిట్ వ్యవహారంలో పోలీసుల విచారణలో ఉన్న నలుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశామని, ఈవిషయంలో పోలీసుశాఖకు సహకరిస్తామని తెలిపారు.
- ఎంఈవోలు కూడా ప్రతీరోజు విధిగా ఒక పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రేయర్‌లో పాల్గొని, ఆ ఫొటోలను గ్రూప్‌లలో పోస్టు చేయాలని ఆదేశించారు.
- ఉపాధ్యాయుల లైవ్‌లొకేషన్‌ను రోజువారీగా సమీక్షించడంతోపాటు అనధికారికంగా గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.
- ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు సైతం ఉపాధ్యాయుల సమస్యలు ఉంటే పాఠశాల సమయంలో కాకుండా, బడి వేళల తర్వాత పరిష్కరించుకోవాలని, లేనిపక్షంలో వారిపైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు

- డీఐఈవో పరశురాం

సారంగపూర్: చదువుపై మక్కువ పెంచుకుని ఇష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని జిల్లా మాధ్యమిక విద్యాధికారి జె.పరశురాం అన్నారు. మండలంలోని చించోలి(బి) ఎక్స్‌రోడ్డు వద్దగల మైనారిటీ గురుకులాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. కళాశాలలోని వంటగది, రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం కళాశాలలో నూతనంగా నిర్మించిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. సొసైటీ ద్వారా పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, తదితర వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం కళాశాలకు వచ్చిన డీఐఈవోను కళాశాల తరఫున అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో మామడ కళాశాల ప్రిన్సిపాల్ రవికిరణ్, మైనారిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు



గణితం బోధిస్తూ ప్రశ్నలు వేస్తున్న కలెక్టర్

- కలెక్టర్ కలెక్టర్ అభిలాష అభినవ్
- లక్ష్మణచాంద కేజీబీవీలో హాస్టల్ నిద్ర

లక్ష్మణచాంద: వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారలను ఆదేశించారు. లక్ష్మణచాంద కేజీబీవీ పాఠశాల, కళాశాలలో శుక్రవారం రాత్రి హాస్టల్ నిద్ర చేశారు. 9 గంటలకు పాఠశాలకు చేరుకునన కలెక్టర్ వంట గదిని పరిశీలించారు. విద్యార్థులకు వండిన ఆహారం రుచి చూశారు. పోషకాలతో కూడిన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. స్టోర్ రూమ్, మరుగుదొడ్లు, రీడింగ్ రూమ్‌లు, విద్యార్థుల వసతి గదులను పరిశీలించారు. అనంతరం తరగతి గదికి వెళ్లి విద్యార్థులకు గణిత సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్నలు వేశారు. సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. సౌర కుటుంబం గురించి ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. తర్వాత కలెక్టర్ టీచర్‌గా మారి గణితం బోధించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధ, ఎంపీవో అమీర్‌ఖాన్, సెక్టోరియల్ అధికారి సలోమి కరుణ, ఎఫ్ఏవో పద్మ, ఎస్‌వో నవిత, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అభిలాష అభినవ్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు



అధ్యక్షుడిని సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

లోకేశ్వరం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు అన్నారు. మండలంలోని బిలోలి ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఎన్నుకున్న మండల కమిటీని శుక్రవారం సన్మానించారు. ఈసందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం దేవేందర్‌రెడ్డి, హావర్గ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేశ్‌రావు, ఉపాధ్యాయులు మెండె వెంకటరమణ, ధనుంజయ్, నాగన్న, వీవీలు ఉన్నారు.

తెలంగాణ గర్వించే వ్యక్తి 'కొండా'

- తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య



కొండా లక్ష్మణ్‌బాపూజీకి నివాళులర్పిస్తున్న రాజయ్య, కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ గర్వించే గొప్ప వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. స్వాతంత్య్ర సమర యోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు, కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య హాజరయ్యారు. నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్‌బాపూజీ మహనీయుడని, మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన ఇంటిని, ఆస్తులను దానం చేశారని తెలిపారు. భావితరాలకు ఆయన గురించి చెప్పాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సాయుధ పోరాటంలో పెత్తందార్లను ఎదురించి నిలిచిన యోధుల తరఫున న్యాయపోరాటం చేశారని తెలిపారు. గాంధీజీ స్ఫూర్తితో దేశ స్వాతంత్య్రోద్యమంలో పాల్గొని, తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటాల్లో అన్ని దశల్లోనూ స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. అణగారినవర్గాల హక్కుల సాధన కోసం, సహకార రంగాల పటిష్టత కోసం కృషిచేశారని తెలిపారు. ఆయన బాటలో అందరూ బంగారు తెలంగాణ కోసం శ్రమించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు గంగాభవాని, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయ్యన్నగారి భూమయ్య, జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, అద్వెపు సుధాకర్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్ద రమణ, జిల్లా అధ్యక్షుడు చిలుక రమణ, ప్రధాన కార్యదర్శి అల్లం అశోక్, గుమిడియాల దత్తాద్రి, ఆడెపు భూమన్న, మిట్టపల్లి నరసయ్య, చిట్టన్న, బిట్లింగు నవీన్, గంగాధర్ పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీ జీవితం స్ఫూర్తిదాయం

నిర్మల్‌చైన్‌గేట్: స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటం, నిజాం వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆయన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందినవారు కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తు తరాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ లాంటి గొప్ప వ్యక్తుల చరిత్రను తెలియజేయాలని సూచించారు. స్వాతంత్య్ర సమరయోధుడిగా, ఉద్యమకారుడిగా, రాజకీయవేత్తగా, సామాజికవేత్తగా కొండా లక్ష్మణ్ బాపూజీ తమ సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, డీపీవో శ్రీనివాస్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, పరిశ్రమల శాఖ మేనేజర్ నరసింహారెడ్డి, కుల సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమానికి ఊపిరి కొండా లక్ష్మణ్‌బాపూజీ

భైంసా: తెలంగాణ ఉద్యమానికి ఊపిరి కొండా లక్ష్మణ్‌బాపూజీ అని బాసర ట్రిపుల్ ఐటీ ఏవో రణధీర్‌సాగీ అన్నారు. ట్రిపుల్ ఐటీలో ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని శుక్రవారం నిర్వహించారు. క్యాంపస్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మూడు దశల్లో పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ పోరాటాన్ని ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్స్ డాక్టర్ పావని, అధ్యాపకులు డాక్టర్ రమాదేవి, డాక్టర్ రాములు, శంకర్, సతీశ్‌కుమార్, ప్రకాశ్, కాశన్న, రాకేశ్‌రెడ్డి, చింత నరేశ్, డాక్టర్ మధుసూదన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు



ట్రిపుల్ ఐటీలో కొండా లక్ష్మణ్‌బాపూజీకి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

క్రీడలతోనూ అవకాశాలు

- డీఈవో రవీందర్‌రెడ్డి
- గుండంపల్లిలో జిల్లాస్థాయి వాలీబాల్ సెలెక్షన్స్



పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

దిలావర్‌పూర్: పాఠశాల స్థాయినుంచే విద్యార్థులు క్రీడల్లో మంచి ప్రావీణ్యం సాధిస్తే ఉన్నత విద్య, ఉద్యోగాల్లోనే అవకాశాలు దక్కుతాయని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుండంపల్లి ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. పోటీలను డీఈవో ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటూ ఆటల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడాకారులకు ఉన్నత విద్య, ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా ఉంటుందని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్, కాంప్లెక్స్ హెచ్ఎం సదానంద్, ఎస్జీఎఫ్ కార్యదర్శి రవీందర్ గౌడ్, పెటా కార్యదర్శి భోజన్న, ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి సరస్వతి, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం

- పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.నరేందర్



ర్యాలీలో నినాదాలు చేస్తున్న విద్యార్థులు, నాయకులు

నిర్మల్‌టౌన్: విద్యార్థుల సమస్యలపై పీడీఎస్‌యూ నిరంతరం పోరాడుతుందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.నరేందర్ అన్నారు. సంఘం ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో శుక్రవారం స్వర్ణోత్సవ సభ నిర్వహించారు. ముందుగా గాంధీ పార్క్ నుంచి టీఎన్జీవో భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ.. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం విద్యారంగ సమస్యలపై పోరాడుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని విస్మరిస్తున్నాయన్నారు. విద్యార్థులు ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని కోరారు. నాలుగేళ్లుగా రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నందిరామయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న, నాయకులు బొడ్డు లక్ష్మణ్, వెంకటస్వామి, గంధం భూమేశ్, గంగన్న, లక్ష్మి, సంజన, ప్రతాప్, సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

నిర్మల్‌టౌన్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గంలో పరిష్కరించేందుకు శనివారం కోర్టుల్లో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలు, రాజీపడే క్రిమినల్ కేసులు, టూ వీలర్, ఫోర్ వీలర్ చలాన్ కేసులు సామరస్యంగా పరిష్కరించేందుకు లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి


బెడద కార్తీక్(ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన బెడద కార్తీక్(28) చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్తీక్ మూడేళ్లుగా పత్తి వ్యాపారం చేస్తున్నాడు. రెండేళ్లుగా ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌కు బానిసగా మారి తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు ఇచ్చినవారు ఒత్తిడి తేవడంతో ఓసారి పురుగుల మందు తాగి ప్రాణాలతో బయటపడ్డాడు. మళ్లీ కొన్ని రోజులకు అప్పులు చేసి రూ.3 లక్షల నుంచి రూ.4లక్షలు బెట్టింగ్‌లో పోగొట్టుకున్నాడు. అప్పులు ఇచ్చిన వాళ్లు ఇంటికి వచ్చి అడుగడంతో తల్లిదండ్రులు లలిత, అంజయ్య కార్తీక్‌ను మందలించారు. దీంతో ఈ నెల 13న కార్తీక్ గడ్డి మందు తాగాడు. హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స అనంతరం , స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం చనిపోయాడు. మృతుడికి భార్య స్రవంతి, కూతుళ్లు లిప్సిక, లాస్య ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..


తిరుపతి (ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కర్ణమామిడి గ్రామానికి చెందిన వడ్డేపల్లి తిరుపతి (41) గురువారం బైక్‌పై మంచిర్యాలకు వెళ్లి రాత్రి ఇంటికి తిరుగుపయనయ్యాడు. గుడిపేట శివారులోని జాతీయ రహదారిపై ఎలాంటి ప్రమాద సూచిక లేకుండా నిలిపి ఉంచిన లారీ చీకట్లో కనిపించకపోవడంతో వేగంగా ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన ఆయన్ను వెంటనే 108 ద్వారా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య స్నేహలత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..

తానూరు: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతిచెందినట్లు ఎస్సై డి.రమేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని మహలింగి గ్రామానికి చెందిన తురాటి విఠల్ (35) శుక్రవారం ఉదయం 7 గంటలకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారిపడి చెరువు నీటిలో మునిగి మృతిచెందాడు. భార్య రాణి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక..

బోథ్: తీవ్ర జ్వరంతో బాధపడుతున్న బాలిక చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి..మండలంలోని సొనాల గ్రామానికి చెందిన అందె సహస్ర (14)కు గతవారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. కుటుంబీకులు ఇటీవల బోథ్ సీహెచ్‌సీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నిర్మల్ జిల్లా కేంద్రానికి తరలించగా వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. యశోద ఆసుపత్రిలో నాలుగు రోజుల చికిత్స అనంతరం శుక్రవారం మృతిచెందింది. బాలిక మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకుంది.

నిర్లక్ష్యానికి నెలవు..ట్రిపుల్‌ఐటీ

- అంతట భద్రతా వైఫల్యం
- లోపాల కారణంగానే ఘటనలు
- పట్టింపులేని అధికారులు



భైంసా: రెగ్యులర్ వీసీ లేకపోవడం..ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవవడం..సిబ్బందిలో తీవ్ర నిర్లక్ష్యం అడుగడుగునా భద్రతా వైఫల్యం ఫలితంగా బాసర ట్రిపుల్ ఐటీలో ఏదో ఒక సమస్య బయటకు వస్తూనే ఉంది. గత నాలుగేళ్ల క్రితం ఏకంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ లైంగిక వేధింపుల ఉదంతం ట్రిపుల్‌ఐటీలో లోపాలను బట్ట బయలుచేసింది. ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ అక్కడి క్యాంపస్ అధికారుల నిర్లక్ష్యాన్ని తనకు అనుకూలంగా మలుచుకుని అప్పట్లో తన చాంబర్‌ను ఏకంగా విద్యార్థినుల వసతి గృహంలో కేటాయించేలా చేసుకోవడం పట్ల అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏకంగా లైంగిక వేధింపుల ఉదంతం భద్రతా నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యమైంది. అప్పట్లో బాసర ట్రిపుల్ ఐటీలో జవాబు పత్రాలకు రెక్కలు వచ్చి యథేచ్ఛగా బయటకు వచ్చి వాటిలో దిద్దుబాటు చేసి మళ్లీ లోపలికి పంపించి చదువులో వెనుకబడిన వారికి సైతం మంచి మార్కులు వచ్చే విధంగా చేసిన ఆరోపణలపై ఇప్పటికీ ఎలాంటి స్పష్టత రాలేదు. ఇలా ట్రిపుల్ ఐటీలో నిర్లక్ష్యం పట్ల అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో తెలియడం లేదు. ఆ విషయాన్ని ఇప్పుడిప్పుడే మరిచిపోతున్నారంటే ఏదో ఒక సంఘటన జరుగుతూ భద్రతా వైఫల్యాన్ని చూయిస్తుంది.

ఆంక్షల కోసమే..

ట్రిపుల్‌ఐటీలో సెక్యూరిటీ గార్డులు ఉన్నా వారందరినీ ఆంక్షల కోసమే విధులు కేటాయిస్తున్నట్లు తెలుస్తోంది. మీడియాను, విద్యార్థి, ప్రజాసంఘాలు, ప్రతిపక్షాల కదలికపైనే ఇక్కడి భద్రతా విభాగం పనిచేస్తున్నట్లు స్పష్టమవుతుంది. ఈ రహస్య క్యాంపస్‌లో ఏమి జరిగిన బయటవారికి తెలియకుండా జాగ్రత్తపడడమే వీరి విధులు అన్నట్లు కనిపిస్తుంది. ఇక విద్యార్థుల భద్రతా కంటే ఇక్కడి విషయాలు బయటకు ఎవరూ చేరవేస్తున్నారో అనే వివరాలు కనిపెట్టేందుకే పనిచేస్తున్నట్లు కనిపిస్తుంది. భద్రతా వైఫల్యంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు ప్రధాన ద్వారం వద్ద ఎవరిని లోనికి అనుమతించకుండా అధికారులు చేస్తున్న అతిపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లాస్థాయి ఉన్నతాధికారులు స్పందించి ట్రిపుల్‌ఐటీపై దృష్టిసారించాలని అంతా కోరుతున్నారు.

లెక్కల్లోనే భద్రత..

ట్రిపుల్ ఐటీలో 110 మంది సెక్యూరిటీ గార్డులు ఉన్నారు. సీఐ పోస్టును కేటాయించి భద్రతపై పోలీసు అధికారులు దృష్టిసారించారు. బాసర ట్రిపుల్ ఐటీ ప్రధాన ద్వారం నుంచి అకాడమిక్ బ్లాక్‌లు, ప్రధాన మార్గాలు, వసతిగృహాలు, కార్యాలయాలు ఇలా అన్నిచోట్ల సెక్యూరిటీ గార్డులు కనిపిస్తారు. లెక్కల్లోనే ఈ సిబ్బంది ఉన్న ఎంతమంది పనిచేస్తారన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇక లోపల జరుగుతున్న విషయాలు బయటకు రానివ్వకపోవడమే అసలు విధులు అనే విధంగా అధికారులు పనిచేస్తున్నారు. ప్రధాన ద్వారంతోపాటు అన్నిచోట్ల సిబ్బంది ఉన్నప్పటికీ ఎక్కడ కూడా ఏమి జరుగుతుందో తెలుసుకోలేని పరిస్థితి ఉంది.

అన్ని లోనికే..

బాసర ట్రిపుల్‌ఐటీలో 9 వేల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. గతంలో డీఎస్పీ, సీఐ, ఎస్సైతోపాటు పది మంది పోలీసులు, వంద మంది సెక్యూరిటీ గార్డులు ఉండేవారు. ప్రస్తుతం ఒక సీఐ పర్యవేక్షణలోనే భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. ఇక ట్రిపుల్ ఐటీలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు ఉన్నప్పటికీ గంజాయి, మద్యం, సిగరేట్లు లోనికి యథేచ్ఛగా వస్తున్నాయి. ఇక్కడి స్టోర్‌లలో పనిచేసే ప్రైవేటు సిబ్బంది వీటిని లోనికి తెచ్చి ఇస్తున్నట్లు సమాచారం. ఈ విషయం తెలిసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల ఇద్దరు విద్యార్థులు గోడ దూకి బయటకి వెళ్లిపోయారు. వీరిపై చర్యలకు క్యాంపస్ అధికారులు ఉపక్రమించారు. గతేడాది కోసం ఓ విద్యార్థిని కోసం గోడ దూకి మరో యువకుడు లోపలకు వచ్చాడు. ఇటీవలే క్యాంపస్‌లో గణేశ్ నిమజ్జన వేడుకల్లో గొడవలు జరిగాయి. ఇలా ట్రిపుల్‌ఐటీలో ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉంది.

ట్రిపుల్‌ఐటీలో ముగిసిన స్మార్ట్‌గ్రిడ్


పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో వారంపాటు నిర్వహించిన స్మార్ట్‌గ్రిడ్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. పునరుత్పాదకశక్తి వనరులపై ఈ సదస్సు ఏర్పాటు చేశారు. ఉన్నత విద్యలో వస్తున్న మార్పులు, అనుసరించాల్సిన విధానాలను చర్చించారు. సైబర్ సెక్యూరిటీ, బిగ్‌డేటా అనాలిటిక్స్, పవర్‌క్వాలిటీ, రియల్‌టైమ్ సిమ్యూలేషన్ సిస్టం అంశాలపై విద్యార్థులు, అధ్యాపకులు చర్చించారు. ఇంజనీరింగ్ అసోసియేట్ మహేశ్, హెచ్‌ఓడీ బావుసింగ్‌పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

జైపూర్: మండల కేంద్రంలోని గురుకులం బీపీసీ సెకండియర్ విద్యార్థి కోటారి రఘు జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. వచ్చేనెల 3, 7వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే సబ్ జూనియర్ బాయ్స్ నేషనల్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. శుక్రవారం విద్యార్థిని కళాశాలలో ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ కమలాకర్, పీఈటీలు సంతోష్, వెంకటేష్ అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటాలి


ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజమల్లు అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం బాల్‌బ్యాడ్మింటన్ అండర్–19 ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు ఆట్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. కైరిగూడ పీవో నరేందర్, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

ఉమ్మడి జిల్లా బాలుర జట్టుకు పి.సాయిచరణ్, సీహెచ్ గోపాలక్రిష్ణ, డి.ప్రేమ్‌దీప్, డి.సిద్దార్థ, సీహెచ్ నిఖిల్, కె.అక్షిత్, ఏ.అఖిల్, టి.రుద్రధృవ, నందం, ఆర్.అక్షయ్ కోచ్‌గా నరేశ్, మేనేజర్‌గా మల్లేశ్ ఎంపికయ్యారు. అలాగే బాలికల జట్టుకు టి.ప్రజ్వల శ్రీ, ఎస్.సాయి శ్రీవర్షిణి, ఎం.సహస్ర, కె.శ్రీ స్ఫూర్తి కారుణ్య, డి.వేరోనిక, డి.నవ్య, టి.ఝాన్సీ, సీహెచ్ లక్ష్మి, కోచ్‌గా గోపాల్, మేనేజర్‌గా కె.భాస్కర్ ఎంపికయ్యారు. ఈ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 4 నుంచి 6 వరకు కామారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

బాసర గోదావరిలో మహిళ గల్లంతు


జయ (ఫైల్)

బాసర: బాసర గోదావరి నదిలో పుణ్యస్నానాల కోసం వచ్చిన మహిళ గల్లంతైంది. వివరాలు ఇలా ఉన్నాయి..నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) గ్రామానికి చెందిన కర్రోళ్ల జయ (41) ఇటీవల తన తల్లి చనిపోయింది. కుటుంబ సభ్యులతో కలిసి బాసర గోదావరికి వచ్చింది. జయ..తన తమ్ముడు రవి భార్య కృష్ణవేణితో కలిసి నదిలో దిగింది. నీటి ప్రవాహానికి జయ, కృష్ణవేణి కొట్టుకుపోగా, ఫైర్ సిబ్బంది, గజఈతగాళ్ల సాయంతో కృష్ణవేణిని కాపాడారు. జయ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. ఎస్సై గణేశ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి.. గజఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు.

వన్యప్రాణుల వేటగాళ్ల అరెస్టు


నిందితులతో అటవీ అధికారులు

లోకేశ్వరం: వన్యప్రాణులను వేటాడి ఇంటికి వస్తుండగా ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎఫ్‌ఎస్‌వో అలేఖ్య తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. మండలంలోని లక్ష్మీనగర్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున అటవీ ఫ్లెయింగ్ స్క్వాడ్ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తున్నారు. లక్ష్మీనగర్ తండాకు చెందిన నగేశ్, మూడ్ శంకర్ వన్యప్రాణులను వేటాడి బైక్‌లపై ఇంటికి వస్తుండగా వారిని వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద 3 అటవీ కుందేళ్లు, 5 కంజులు, వేటాడే వలలు, బైక్‌ను స్వాధీనం చేసుకుని జిల్లా అటవీ అధికారులకు అప్పగించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్వో రామకృష్ణరావు తెలిపారు. ఎఫ్‌బీవో పాజిల్ హుస్సేన్, సాయారెడ్డి ఉన్నారు.

దొంగలను పట్టుకున్న గ్రామస్తులు


దొంగలను తాళ్లతో కట్టిసిన గ్రామస్తులు

తానూరు: మండలంలోని మహలింగిలో శుక్రవారం పట్టపగలే చోరీకి పాల్పడిన నలుగురు దొంగలను గ్రామస్తులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాలు..నిజామాబాద్ జిల్లా జానకంపేట్‌కు చెందిన అశోక్, రాజు, మీనా, పోసమ్మ.. మహలింగిలో డబ్బాలు అమ్మేందుకు వచ్చారు. పిరాజీ ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించి చోరీ పాల్పడ్డారు. గమనించిన గ్రామస్తులు వారిని పట్టుకుని తాళ్లతో కట్టి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని దొంగలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్సై రమేశ్ తెలిపారు.

ఆరుగురు బైండోవర్

నెన్నెల: మండల కేంద్రంలో శుక్రవారం ఆరుగురిని బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం గంజాయి సేవిస్తూ పట్టుబడిన 8 మందిలో నుంచి ఆరుగురిని తహసీల్దార్ రమేశ్ ఎదుట హాజరుపర్చి బైండోవర్ చేసినట్లు వివరించారు.

ఒకరి బైండౌన్..

నెన్నెల మండలంలో మరొకరిని బైండౌన్ చేశారు. బెల్లంపల్లి మండలం దుగినేపల్లికి చెందిన చల్లూరి రమాకాంత్ గతంలో దొంగతనం కేసులో బైండోవర్ చేయగా అతను బైండోర్ నిబంధనలు ఉల్లంఘించి తాజాగా గురువారం గంజాయి సేవిస్తూ పట్టుబడ్డాడు. దీంతో రమాకాంత్‌ను తహసీల్దార్ రమేశ్ ఎదుట హాజరుపర్చి బైండౌన్ చేసినట్లు ఎస్సై వివరించారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం


వృద్ధురాలి కుటుంబీకులతో మాట్లాడుతున్న సీఐ సైదారావు

ఖానాపూర్: పట్టణానికి చెందిన వృద్ధురాలు గోదావరిలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. సీఐ సైదారావు కథనం ప్రకారం.. సుభాష్‌నగర్ కాలనీకి చెందిన వృద్ధురాలు బోదాసు సాయవ్వ ఆర్థిక ఇబ్బందులు, ఇతర సమస్యలతో సతమతమవుతుంది. ఈ క్రమంలో శుక్రవారం గోదావరిలో దూకగా, అక్కడే చేపలు పడుతున్న జాలర్లు చూసి ఆమెను కాపాడారు. డయల్ 100కు సమాచారం అందించడంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది తిరుపతి, రాజేశ్వర్ అక్కడికి చేరుకుని వృద్ధురాలిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వృద్ధురాలి కుటుంబీకుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చామని సీఐ తెలిపారు. క్షణికావేశంలో ఎవరూ అఘాయిత్యాలకు పాల్పడవద్దన్నారు.

ధర్మారంలో వివాహిత ..

మంచిర్యాలక్రైం: థైరాయిడ్ మాత్రలు మింగి వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన హాజీపూర్ మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. హాజీపూర్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన జ్యోతి ఆమె భర్త మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. దీంతో జ్యోతి..పోలీసులను ఆశ్రయించింది. పది నెలలుగా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా ఫలి తం లేకపోయింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో శుక్రవారం థైరాయిడ్ మాత్రలు మింగింది. గమనించిన కుటుంబీకులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ నరేశ్‌ను సంప్రదించగా, సదరు మహిళ కేసు పెట్టమంటే పెట్టడం లేదన్నారు. కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. అయినా న్యాయం కావాలని కోరుతుందన్నారు. కేసు పెడితే కోర్టుకు పంపిస్తామని చెప్పినా వినడం లేదన్నారు.

గేదెల పైనుంచి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో శుక్రవారం రాత్రి గేదెల పైనుంచి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. ఘటన స్థలంలో రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. గమనించిన స్థానికులు ఆర్టీసీ బస్సును ఆపే ప్రయత్నం చేయగా డ్రైవర్ బస్సును ఆపకుండా అక్కడి నుంచి తీసుకెళ్లిపోయా డు. ఈ విషయమై స్థానికులు ఆదిలాబాద్ ఆర్టీసీ డీఎం కల్పనకు ఫోన్ ద్వారా బస్సు నంబర్ తెలియజేయగా, ఈ బస్సు నిర్మల్ జిల్లాకు చెందినదిగా పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన వివరాలను నిర్మల్ డీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.

మహిళను కాపాడిన పోలీసులు

నిర్మల్‌టౌన్: స్థానిక బంగల్‌పేట్ చెరువులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన సంతోష్–రాధ భార్యభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం భర్తతో గొడవ జరగడంతో రాధ మనస్తాపం చెందింది. పక్కనే ఉన్న బంగల్‌పేట్ చెరువులో దూకేందుకు వెళ్లింది. అప్పటికే భర్త సంతోష్ డయల్ 100 కి ఫోన్ చేసి సమాచారం అందించాడు. బ్లూకోల్ట్స్ సిబ్బంది అజార్ ఖాన్, రాథోడ్ అనిల్ అక్కడికి చేరుకుని నీటమునిగిపోతుండగా ఆమెను కాపాడారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ భార్యభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బ్లూకోల్ట్స్ సిబ్బందికి నగదు బహుమతి అందించారు.

మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- ఆశ్రమ బాలికల పాఠశాల తనిఖీ


విద్యార్థినులకు ప్రశ్నలు వేస్తున్న ఖుష్బూ గుప్తా

ఇంద్రవెల్లి: విద్యార్థినులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరుపట్టిక, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులకు వెళ్లి పాఠ్యాంశాలపై విద్యార్థినులకు ప్రశ్నలు వేసి జవాబు రాబట్టారు. ఉపాధ్యాయులు సులభపద్ధతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్డి శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఆమె వెంట ట్రెయినీ కలెక్టర్ అజ్మీర సంకేత్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఉన్నారు.

రాష్ట్రకూట భైరవ విగ్రహం గుర్తింపు

కుంటాల: కుంటాల ఇలవేల్పు గజ్జలమ్మ ఆలయ తూర్పున 9వ శతాబ్దపు రాష్ట్రకూట భైరవ విగ్రహాన్ని శుక్రవారం గుర్తించినట్లు ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు డాక్టర్ తుమ్మల దేవరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తుశకం 6వ శతాబ్దానికి చెందిన రాష్ట్రకూట రాజు ఈ విగ్రహాన్ని చెక్కించినట్లు తెలిపారు. నిర్మల్ జిల్లా రాష్ట్రకూట రాజు రెండవ కృష్ణుని ఏలుబడిలో దిలావర్‌పూర్‌లో వెలుగులోకి వచ్చిన శాసనం వల్ల తెలిసిందన్నారు. కుంటాలలో భైరవ విగ్రహం పెద్ద దమిల్లా జట ఘాటం, పెద్ద కుండలాలు, కర్ణ ఆభరణాలు, మెడలో హారం, నిజహస్తాలతో కత్తి, రక్తంతో కూడిన పాత్ర, కాపాల జంధ్యం, దండకం, ఢమరుకం , ముంజేతు కంకణం, మొలతాడు త్రీ భంగిమలో వైతస్థికపాద భంగిమలో ఉండి కాళ్ల కింద స్వర్ణ వాహనం ఉంది. వీటిని పరిశీలిస్తే అష్ట భైరవుల్లో కాలభైరవునిగా గుర్తించినట్లు దేవరావు తెలిపారు. ఆయన వెంట రాజేశ్వర్‌రెడ్డి, సుజాత ఉన్నారు.

ఎస్టీపీపీలో విధులకు తీసుకోవడం లేదని ఆత్మహత్య

- గడ్డి మందు తాగిన కాంట్రాక్ట్ కార్మికుడు
- చికిత్స పొందుతూ మృతి


బాలకృష్ణ(ఫైల్)

జైపూర్: ఎస్టీపీపీలో తనను విధులకు తీసుకోవడం లేదని మనస్తాపంతో కాంట్రాక్టు కార్మికుడు గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు..పెగడపల్లి గ్రామానికి చెందిన మాసు బాలకృష్ణ(35) ఎస్టీపీపీలోని పవర్‌మేక్ కంపెనీలో బీవోపీ(బ్యాలెన్స్ ఆఫ్ ప్లాంటు) హెల్పర్‌గా పని చేస్తున్నాడు. 8 ఏళ్లుగా పని చేస్తుండగా, గతంలో ఊపిరితిత్తులు చెడిపోవడంతో విధులకు వెళ్లలేదు. ఓ వైపు ఆర్థిక ఇబ్బందులు, మరో వైపు దుమ్ముతో గత మూడు నెలలుగా అనారోగ్యం బారినపడ్డాడు. విధులకు వెళ్లడం లేదు. ఆరోగ్యం కుదటపడ్డాక డ్యూటీలోకి తీసుకోవాలని పక్షం రోజులుగా అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. దీంతో మనస్తాపం చెందిన బాలకృష్ణ గురువారం సాయంత్రం ఇంట్లో గడ్డి మందు తాగాడు. కుటుంబీకులు గమనించి మంచిర్యాలకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు రిషీచంద్ర, నిహాల్ ఉన్నారు.

అనారోగ్యంతో ఒకరు..


నాందేవ్ (ఫైల్)

వాంకిడి: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన హిరై నాందేవ్ (54) గతేడాది పక్షవాతం లక్షణాలతో బాధపడుతున్నాడు. కొన్నిరోజులుగా మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అట్టహాసంగా జోనల్ స్థాయి గిరిజన క్రీడోత్సవాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ కేబీ ప్రాంగణ మైదానంలో శుక్రవారం జోనల్ స్థాయి గిరిజన క్రీడోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్‌లో క్రీడల కోసం రూ.325 కోట్లు కేటాయించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లో సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తామన్నారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ క్రీడల్లో రాణించేలా గిరిజన విద్యార్థులను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఈఎంఆర్‌ఎస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఫేర్‌వెల్ కార్యక్రమానికి పీవో హాజరయ్యారు. విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. అసిస్టెంట్ కలెక్టర్ అజ్మీర సంకేత్, ఏపీవో వసంత్‌రావు, కాంగ్రెస్ నాయకుడు సామ ప్రభాకర్ రెడ్డి, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఏటీడీవోలు క్రాంతి, అమిత్, నిహారిక, హెచ్‌ఎంలు ప్రకాశ్, ఆత్రం భాస్కర్, ప్రేమ్‌దాస్, కృష్ణరావు, జగన్, శివాజీ, హేమంత్‌నివాస్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో మరో ఇద్దరు అరెస్టు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ నా యకుడు జగన్మోహన్‌రావు వద్ద పనిచేస్తున్న సూపర్‌వైజర్ మేర సంజీవ్‌పై ఈనెల 23న అర్ధరాత్రి జరిగిన దాడి కేసులో మరో ఇద్దరిని శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ బన్సిలాల్ తెలిపా రు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఒక క త్తి, ఆటోమేటిక్ ఐరన్ స్టిక్ స్వాధీనం చేసుకుని, నిందితులు పోచంపల్లి సంపత్, కాతం రమేశ్‌లను రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేశామన్నారు.

తాత్కాలిక ఉద్యోగురాలికి పాముకాటు

బాసర: బాసర ఆలయంలోని డార్మటరీ భవనంలో తాత్కాలిక ఉద్యోగురాలు కొట్బొల్ల శారద (40)ను శుక్రవారం పాము కాటేసింది. సిబ్బంది అప్రమత్తమై స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన కోసం అంబులెన్సులో నిజామాబాద్‌కు పంపించారు. అక్కడ చికిత్స పొందుతుండగా ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.